## క్లుప్తంగా

### పన్నులు వసూలు చేయాలి



బచ్చన్నపేట: గ్రామాల్లో వంద శాతం ఇంటి, నల్లా పన్నులను పంచాయతీ కార్యదర్శులు వసూలు చేయాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని గంగాపూర్‌లో ఆయన పర్యటించి పల్లెప్రగతి పనులు వననర్సరీ , డంపింగ్ యార్డు, స్వర్గధామాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, జీపీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిక



తరిగొప్పుల: మండలంలోని అబ్దుల్‌నాగారంలో వివిధ పార్టీలకు చెందిన యువకులు, మహిళలు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామశాఖ అధ్యక్షుడు కావటి సుధాకర్ ఆధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఏర్పడితే బతుకుల బాగుపడుతాయని రాష్ట్ర ప్రజలు ఎన్నో కలలు కంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో భూ కబ్జాలు, దాడుల తప్ప ఎలాంటి అభివృద్ధి జరగడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూత్ అధ్యక్షుడు పండుగ సంపత్, మూల రాములు, బాషబోయిన సురేష్ పాల్గొన్నారు.

### ఉపాధి పనులను వినియోగించుకోవాలి



జఫర్‌గఢ్: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను కూలీలు వినియోగించుకోవాలని సర్పంచ్ పొన్నాల జ్యోతి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి కోరారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉపాధి పనులను వారు సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడుతున్నట్లు తెలిపారు. ఉప సర్పంచ్ పులి ఆశోక్, పంచాయితీ కార్యదర్శి రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ యాకనాథం, కూలీలు పాల్గొన్నారు.

### రెండో రోజూ సమావేశాలు

చిల్పూరు: ఎంపీటీసీల సమస్యలు, రావాల్సిన నిధులు, హక్కులపై పట్టించుకోక పోవడంతో ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత, వైస్ ఎంపీపీ భూక్య సరితలపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎంపీటీసీలు సోమవారం కూడా రహస్య సమావేశం నిర్వహించుకున్నారు. ఆదివారం సమావేశం నిర్వహించిన ఎంపీటీసీలు సోమవారం మండల సర్వసభ్య సమావేశానికి సైతం హాజరు కాకుండా సమావేశం నిర్వహించారు. రెండురోజుల్లో కలెక్టర్, ఆర్డీఓలను కలిసేందుకు తీర్మానం చేసుకున్నట్లు తెలిసింది.

### రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: రైలునుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి (40) మృతిచెందిన సంఘటన మండలంలోని ఇప్పగూడెం –స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం జరిగింది. కాజీపేట జీఆర్‌పీ ఎస్‌ఐ సీహెచ్.పరుశరాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇప్పగూడెం, ఘన్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య డౌన్ లైన్‌లో 302/2–4 మధ్య రైలు నుంచి జారిపడగా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని మార్చురీ గదిలో భద్రపరిచారని, ఎవరైనా గుర్తిస్తే 98663-30257 నంబర్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

# అంధత్వ నివారణే ధ్యేయం



చిల్పూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య



పాలకుర్తి: శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



జఫర్‌గఢ్: తిమ్మాపూర్‌లో..

చిల్పూరు: అంధత్వ నివారణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డాక్టర్ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్నవారు శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ విమల, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీ సరిత, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, ఉప సర్పంచ్ మహేందర్, పంచాయతీ కార్యదర్శి అజీజ్‌పాషా, క్యాంప్ మెడికల్ ఆఫీసర్ మౌనిక, డాక్టర్ బాణాల రాజమౌళి, హెచ్‌ఈఓ బుచ్చిరెడ్డి ఆశ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

**ఈరవెన్నులో 'కంటివెలుగు'**

పాలకుర్తి: ప్రతి ఒక్కరూ కంటివెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ నల్ల నాగిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఈరవెన్నులో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో నేత్ర సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి అద్దాలను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల చిట్యాల ఐలమ్మ, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ముస్కు రాంబాబు, వైద్యురాలు సునీత, సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ కొడిశాల యాదగిరి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్‌లో..**

జఫర్‌గఢ్: తిమ్మాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ పొన్నాల జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు యార నీలమ్మ సోమిరెడ్డి, ఉప సర్పంచ్ పులి ఆశోక్, మార్కెట్ డైరక్టర్ పెంతల రాజ్‌కుమార్, వార్డు సభ్యులు సుధా, మమత, హరికృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు బక్కం యాదలక్ష్మి, పులి సరితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**నేటి నుంచి 19వ వార్డులో కంటి వెలుగు..**

జనగామ: జనగామ పట్టణంలోని 19వ వార్డు గణేష్‌వాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నేటి నుంచి (మంగళవారం)కంటి వెలుగు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని ఆరోగ్య సామాజిక అధికారి రహమాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆదివారాలు మినహా ఈ నెల18వ తేదీ వరకు జరిగే కంటి వెలుగు వైద్య శిబిరాన్ని వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సేంద్రియ వ్యవసాయంపై దృష్టిపెట్టాలి



లేగదూడలను పంపిణీ చేస్తున్న మహేష్ అగర్వాల్

తరిగొప్పుల: రసాయన ఎరువుల వాడకం క్రమక్రమంగా తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని సహయోగి ఆర్గనైజేషన్ గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ సూచించారు. సోమవారం మండలంలోని బొత్తలపర్రెలోని మహిళా రైతులకు సహయోగి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర గోషాల రాష్ట్ర అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌తో కలిసి ఆయన లేగదూడలను పంపిణీ చేశారు. గోవుల పేడ, మూత్రంతో సేంద్రియ రసాయనాలు, పేడతో దీపంతాలు, విగ్రహాలు, టూత్ పేస్ట్ తయారు చేయడం జరుగుగుందని గ్రామీణ మహిళలు ఇదేవిధంగా తయారు చేసుకోవాలని సూచించారు. నరేష్, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే దేశసమగ్రాభివృద్ధి సాధ్యం



మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

దేవరుప్పుల: తెలంగాణ అభివృద్ధి సంక్షేమ పథకాల మార్గదర్శకంగా బీఆర్‌ఎస్‌తో దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ధరావత్‌తండాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జాతీయ పార్టీగా విస్తరిస్తున్న క్రమంలో అన్ని పార్టీల నుంచి వచ్చే శ్రేణులకు స్వాగతిస్తామన్నారు. పార్టీలోచేరిన వారిలో ధరావత్ పెంద్యా, కిషన్,దేవ్త, మునావత్ భాస్కర్, బానోత్ నర్సింహ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, మండల సమన్వయకర్త పల్ల సుందర్‌రామిరెడ్డి, వైస్‌ఎంపిపి విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ గేమానాయక్, దేవాతోపాటు తదితరులు ఉన్నారు.

## ఐకమత్యంతో ముందుకు సాగాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాంబాబు

రఘునాథపల్లి: రజకులు ఐకమత్యంతో ముందుకు సాగాలని జిల్లా రైతుబంధు సమితి సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ మారుజోడు రాంబాబు అన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మూడో మహాసభల కరపత్రాలను ఆయన సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. రజకుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 250 యూనిట్ల ఉచిత కరెంట్‌ను రజకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో రజక కులస్తులకు కమ్యూనిటి హాల్ మంజూరు కోసం ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిసి విజ్ఞప్తి చేస్తామని పేర్కొన్నారు. రజక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకలు ఎదునూరి గట్టేశం, డాక్టర్ సారయ్య, మదర్, రాములు, సోమన్న, యామంకి శ్రీను పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం





చలివేంద్రం ప్రారంభిస్తున్న బాల్దె సిద్దిలింగం

జనగామ రూరల్: మండలంలోని పెంబర్తి గ్రామం నేషనల్ హైవేపై సోమవారం గోదాల కృష్ణరెడ్డి స్మారకార్థం వంశీ రెడ్డి సహకారంతో పూర్ పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేద్రంను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీచైర్మన్ బాల్దె సిద్దిలింగం పాల్గొని చేతుల మీదుగా ప్రారంభించారు. చైర్మన్ జోసెఫ్ బాబు, నిర్మాల భాస్కర్, డాక్టర్ రాజమౌళి, ప్రేమ్ సాగర్, రాములు, స్వామి, రాజు, ఎల్లయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఏఓకు వినతి

దేవరుప్పుల: మండలంలోని కడవెండిలో పదేళ్ల కిందట విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తన సొంత భూమిని రైతు పైండ్ల సోమయ్య వానకొండయ్య గుట్టకు పోయే దారిలో ఇచ్చాడు. ఇందుకుగానూ రాష్ట్ర ప్రభుత్వం భూమి నిర్దేశిత నష్ట పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. నేటికీ తన కుటుంబానికి న్యాయం జరగలేదని, ఈ విషయమై జిల్లా కలెక్టరేట్‌లో ఏఓ మన్సూర్‌కు సోమవారం వినతి పత్రం అందజేసినట్టు సోమయ్య వివరించారు.

## 'క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న ఉషారవి

రఘునాథపల్లి: కురుమ కులస్తులను సంఘ విద్రోహ శక్తులుగా మారారని వ్యాఖ్యానించిన జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి కురుమలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని సంఘం యువ చైతన్య సమితి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి, ఎంపీటీసీ పేర్నె ఉషారవి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన కురుమ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. సోలిపురంలో కురుమలపై జరిగిన దాడిపై కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, జిల్లా అధ్యక్షుడు కంచ రాములు బాధితులకు సంఘీబావం తెలిపి మనోధైర్యాన్ని కల్పిస్తే ఎమ్మెల్యే అనుచిత వాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. వెంటనే ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు గొరిగె రవి, యువ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడు పేర్నె రవి, నాయకులు ద్యావర యాకయ్య, కేమిడి రాజు, మాయ రాములు, మరాటి జంపయ్య, పేర్ని రాజాలు, బడితె శ్రీనివాస్, శ్రీను, వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బలగం సినిమా ప్రదర్శన



జనగామ: సినిమా ప్రదర్శనలో ప్రముఖులు

జనగామ: జనగామ పట్టణంలోని 20వ వార్డు (కుర్మవాడ)లో సోమవారం రాత్రి 10 గంటలకు బలగం సినిమా ప్రదర్శించారు. బేజాడి ఉపేందర్ జ్ఞాపకార్థం ఆయన సతీమణి కవిత ఆధ్వర్యంలో ప్రదర్శించిన సినిమా కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ జూకంటి లక్ష్మి శ్రీశైలం, కర్రె కృష్ణ, డి.శ్రీనివాసు పాల్గొన్నారు.

**బచ్చన్నపేటలో..**

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం ప్రాంగణంలో కుటుంబ నేపథ్యం ఉన్న బలగం సినిమాను గ్రామ సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి సొంత ఖర్చులతో సోమవారం వేయించారు. ఈ సినిమాను చూడడానికి చాలా మంది కుటుంబసమేతంగా వచ్చి తిలకించారు. గ్రామ గ్రామాన బలగం చిత్రాన్ని దాతలు ప్రదర్శిస్తున్నారు. ఉప సర్పంచ్ కొండ హరికృష్ణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభినందనీయం



తాగునీటి బోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిల్పూరు: చిల్పూరు ఆలయ అభివృద్ధికి కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు కుటుంబ సభ్యుల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట వద్ద భక్తుల తాగునీటి సౌకర్యార్థం చైర్మన్ శ్రీధర్‌రావు తండ్రి చక్రధర్‌రావు జ్ఞాపకార్థం తల్లి సుభద్రాదేవి విరాళంతో బోర్‌ను వేయించగా సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు చేపట్టిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తహసీల్దార్ విమల, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాస్, ఎంపీఓ మధుసూదన్, ఎంపీపీ సరిత, వైస్ ఎంపీపీ భూక్య సరిత, ఎంపీటీసీ సుధాకర్, సర్పంచ రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

**గిఫ్ట్ ప్యాకెట్లను అర్హులకు అందించాలి**

స్టేషన్‌ఘన్‌పూర్: రంజాన్ పర్వదినం సందర్భంగా పేద ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అందించే గిఫ్ట్ ప్యాకెట్లు (దుస్తులు) అర్హులైన పేదలకు అందించేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రంజాన్ పండుగ సందర్భంగా నిరుపేద ముస్లింలకు గిఫ్ట్ ప్యాకెట్లు, ఇఫ్తార్ విందు అందించే విషయమై ప్రభుత్వ అధికారులు, ముస్లీం మత పెద్దలతో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని మతాలకు చెందిన పండుగలకు సరైన ప్రాధాన్యత ఇస్తూ పేదలను ఆదుకుంటున్నారన్నారు.

**రంజాన్ ఇఫ్తార్ విందు నిర్వహణ కమిటీ**

రంజాన్ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందు నిర్వహణ కమిటీని ఎమ్మెల్యే రాజయ్య ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి ఇస్మాయిల్, తహసీల్దార్లు పూల్‌సింగ్‌చౌహాన్, అన్వర్, అంజయ్య, విమల, రాజు, రామారావు, ఎంపీడీఓలు హసీం, శ్రీధర్‌స్వామి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్ ఉన్నారు.

## సబ్సిడీపై రోటావేటర్ల పంపిణీ



రోటావేటర్లను అందజేస్తున్న ప్రతినిధులు

లింగాలఘణపురం: క్లెం ఆదర్శ ఏనెబావి, వనపర్తి నేలతల్లి పరస్పర రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో కిసాన్ పరివార్ ఫౌండేషన్ సహకారంతో సోమవారం ఆరుగురి రైతులకు 35 శాతం సబ్సిడీతో రోటావేటర్లను పంపిణీ చేశారు. ఆదర్శ ఏనెబావి సంఘం అధ్యక్షుడు పరకాల కృష్ణ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కిసాన్ పరివార్ ఫౌండేషన్ చైర్మన్ విఘ్నేష్, వైస్ చైర్మన్, చంద్రమౌళి పాల్గొని మాట్లాడుతూ రైతులు రోటావేటర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ్‌పాండే ఫౌండేషన్ జనగామ టీం లీడర్ ప్రమోద్, సీఈఓలు సురేందర్, గిరిబాబు, రైతులు శంకరయ్య, రవి, మల్లేశ్, వెంకన్న, మహేందర్ పాల్గొన్నారు.

## ఓబీసీలకు తీవ్ర అన్యాయం

బచ్చన్నపేట: దేశంలో అత్యధిక జనాభా కలిగిన ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకూరి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా వైద్య, దంత కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్‌లో కేంద్ర ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడంతో డెంటల్ విద్యార్థులు 11 వేల సీట్లను కోల్పోయారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, చట్ట సభల్లో రిజర్వేషన్ కోసం ఎంతో కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తే ఓబీసీలకు సామాజిక ఆర్థిక కులగణన ప్రకారం పెద్దపీట వేస్తుందని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రం సందర్శన



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్ సందర్శించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన నిఘాను పరిశీలించారు. ఆయనతో పాటు సీఐ సంతోష్, ఎస్సై ప్రవీణ్ ఉన్నారు.

## ఘన్‌పూర్‌లో 'ఈటల'కు ఘన స్వాగతం



ఈటల రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తుండగా ఘన్‌పూర్ శివారులో బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం సుభాష్ ఆధ్వర్యంలో మండలంలోని శివునిపల్లి, పాంనూర్ తదితర గ్రామాలకు చెందిన దాదాపు 40 మంది బీఆర్‌ఎస్ తదితర పార్టీల నుంచి బీజేపీలో చేరారు. ఈటల రాజేందర్ వారికి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు యుగేందర్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, ప్రదీప్, కిషోర్, ఉపేందర్, మధు, ఆర్‌ఎంపీ డాక్టర్ సంపత్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసు నమోదు

చిల్పూరు: మండలంలోని దేశాయితండాకు చెందిన భూక్య దివ్య (18) కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్‌కుమార్ సోమవారం తెలిపారు. దేశాయితండాకు చెందిన భూక్య శంకర్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రోజు మాదిరిగానే ఈనెల 8వ తేదీన రాత్రి అందరూ భోజనం చేసి నిద్రించారు. 9న ఉదయం లేచేసరికి చిన్నకూతురు దివ్య కనిపించక పోవడంతో చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## మండల సర్వసభ్య సమావేశం వాయిదా





సభను వాయిదా వేయాలని తీర్మానం చేస్తున్న మల్కాపూర్ ఎంపీటీసీ సుధాకర్

చిల్పూరు: మండల కేంద్రంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక పోవడంతో సభను వాయిదా వేయాలని మల్కాపూర్ ఎంపీటీసీ మునిపల్లి సుధాకర్ తీర్మానం చేయగా ఎంపీపీ సరిత సభను వాయిదా వేశారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ సరిత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కాగా, కోరం లేకపోవడంతో మల్కాపూర్ ఎంపీటీసీ సభను వాయిదా వేయాలని తీర్మానం చేయడంతో ఎంపీపీ సభను వాయిదా వేసి త్వరలో సమావేశం తేదీని ప్రకటిస్తామని చెప్పారు.

**బహిష్కరించడం సరికాదు..**

సభ వాయిదా అనంతరం విలేకరులతో ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీలకు నిధులు సక్రమంగా ఇవ్వడంలేదని రహస్య సమావేశాలను నిర్వహిచడం, సర్వసభ్య సమావేశాన్ని హాజరుకాకుండా బహిష్కరించడంతో ప్రజా సమస్యలను తీర్చలేమన్నారు. మండలంలో ప్రతీ ఎంపీటీసీకి రూ. 5 లక్షల ప్రొసీడింగ్ ఇచ్చామని అందులో ముగ్గురు తప్ప ఒక్కరూ గ్రామల్లో అభివృద్ధి చేయలేదన్నారు.

## నేడు ఉచిత వైద్యశిబిరం

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్‌లో జ్యోతిరావుపూలే జయంతిని పురష్కరించుకొని ఈ నెల 11న జనగామ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజ్, డాక్టర్ కల్నల్, మాచర్ల భిక్షపతిల నేతృత్వంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం సోమవారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో గుండెపోటు నివారణ, మోకాళ్ల నొప్పులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఐలమ్మ స్మృతి వనం ఏర్పాటు చేయాలి



మట్లాడుతున్న సమ్మయ్య

పాలకుర్తి టౌన్: పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పేరుతో ఐదు ఎకరాల స్థలంలో స్మృతి వనం ఏర్పాటు చేయాలని రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల సమ్మయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల సమావేశంలో అయన మాట్లాడారు. రజక వృత్తిదారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చిట్యాల సోమన్న, నాయకులు చిట్యాల ఎల్లయ్య, సోమయ్య, సాంబరాజు, రాములు, సురేష్, యాకయ్యచ అనిల్, సోమనాథం, యాదమ్మ, మచ్చ సోమయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## కోతిపిల్లకు ప్రాణం పోశారు







అచేతన స్థితిలో కోతిపిల్ల, ఓఆర్‌ఎస్ తాగిస్తూ.. తేరుకున్న కోతిపిల్ల

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయం ఎదురుగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పైకప్పు వద్ద ఆదివారం కోతిపిల్ల తన చేష్టలతో వలలో చిక్కి.. రోజలంతా అందులోనే విలవిల్లాడింది. దానిని బయటకు తీయడానికి తల్లి, మరికొన్ని కోతులు చేసిన ప్రయత్నం విఫలమైంది. సాయంత్రం వరకు చూసి కోతులన్నీ దూరంగా వెళ్లిపోయాయి. స్థానికులు వలను కత్తిరించి కోతిపిల్లను తీయగా.. తల్లితో కలిసిపోయింది. కోతిపిల్ల కాలుకు వల తాలూకు దారాలు అలానే ఉన్నాయి. సోమవారం గ్రంథాలయం ఎదురుగా ఉన్న చెట్టు వద్దకు కోతిపిల్ల రాగా కొమ్మకు తట్టి.. వేలాడుతూ అచేతన స్థితికి చేరింది. చనిపోయిందని భావించిన కోతులు వెళ్లిపోయాయి. స్థానికులు కోతిపిల్లను కిందకు తీయగా కొనఊపిరితో ఉండగా స్థానిక పశువైద్యశాలకు తీసుకెళ్లడంతో ఆఫీస్ సబార్డినేట్ నాగరాజు ఇంజక్ష్ వేసి.. ఓఆర్‌ఎస్ ద్రావణం తాగించి చికిత్స అందించాడు. గంట తర్వాత స్పృహలోకి వచ్చిన కోతిపిల్ల అరవడంతో కోతులన్నీ వచ్చి తీసుకెళ్లాయి.